సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023





### ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్ట్

మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని బి..మఠం మండలం నందిపల్లి క్రాస్ వద్ద ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేశారు. - 8లో



### పెయ్యదూడల ఉత్పత్తి.. పాడిరైతుకు సంపత్తి

పెయ్య దూడల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి పాల దిగుబడులను గణనీయంగా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.0/17.6

### వాతావరణం

జిల్లాలో బుధవారం 17.6 - 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

# పీఆర్‌కు సంపూర్ణ మద్దతు



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి రామసుబ్బారెడ్డి

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపు
- శిల్పారామంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం

**కడప కార్పొరేషన్:** స్థానిక సంస్థల శాసనమండలి సభ్యునిగా వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ చేస్తున్న పి. రామసుబ్బారెడ్డికి ప్రజాప్రతినిధులంతా సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కడప రిమ్స్ సమీపంలోని శిల్పారామంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్థానిక సంస్థల సమస్యలపై అవగాహన, అనుభవం ఉన్న నాయకుడు రామసుబ్బారెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ బీ ఫారంతో గెలిచిన ప్రతి ఒక్కరూ ఆయనకు మద్దతు ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి రామసుబ్బారెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

- జమ్మలమడుగు ఎమ్మెల్యే డా. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం అందరం సమష్టిగా కృషి చేసి రామసుబ్బారెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ మాట్లాడుతూ 2019 నుంచి ఏ ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తూ వస్తోందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అదే పునరావృతం కావాలన్నారు. అనంతరం వారు రామసుబ్బారెడ్డిని సత్కరించారు.
- ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ప్రభుత్వ సలహాదారు(ఉద్యానశాఖ) సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ బి. నిత్యానందరెడ్డి, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు పాకా సురేష్, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

#### అణగారిన వర్గాలకు రాజ్యాధికారం

అణగారిన వర్గాలకు రాజ్యాధికారం కల్పించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ అభ్యర్థి పి. రామసుబ్బారెడ్డి అన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

#### సామాజిక విప్లవానికి నాంది పలికారు

రాష్ట్రంలో సామాజిక విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. కేబినెట్ కూర్పు మొదలు కొని ఇప్పటి వరకూ అన్ని వర్గాలకు సమన్యాయం చేయడంలో ముఖ్యమంత్రి దేశంలోనే పేరెన్నికగన్నారన్నారు.

#### అన్ని వర్గాలకు పదవులు

అన్ని వర్గాలకు ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు అన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించడంతో ముఖ్యమంత్రికి సదా రుణపడి ఉంటామన్నారు.

#### ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా బలపరచాలి

ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా ప్రజా ప్రతినిధులంతా రామసుబ్బారెడ్డిని బలపరచాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి మొదటి నుంచి తిరుగులేని మెజార్టీ ఉందన్నారు.

#### ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లోనూ గెలిపించాలి

స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజవర్గాలకు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులంతా గౌరవించి మద్దతివ్వాలన్నారు.

#### తెలివిగలవారెవరూ పోటీ పెట్టరు

జిల్లాలో తెలుగుదేశం పార్టీ, బీజేపీలకు నామమాత్రపు సంఖ్యాబలమే ఉందని, తెలివిగలవారెవరూ ఈ ఎన్నికల్లో పోటీ చేయబోరని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రామసుబ్బారెడ్డి అనుభవాన్ని గుర్తించి ఈ పదవి ఇవ్వడం సంతోషదాయకమన్నారు.

#### సీఎం వైఎస్ జగన్‌కు కానుక అందించాలి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా రామసుబ్బారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుక అందించాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. 2024లో కూడా సమష్టిగా కృషి చేసి వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తేవాలని కోరారు.

## అట్టహాసంగా పొన్నపురెడ్డి నామినేషన్

**వెంట వచ్చిన డిప్యూటీ సీఎం, మేయర్, ఎమ్మెల్యేలు**

**కడప కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. బుధవారం కడప శిల్పారామంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులతో సమావేశం అనంతరం కలెక్టరేట్‌కు చేరుకున్న రామసుబ్బారెడ్డి మధ్యాహ్నం 1.58 గంటలకు జిల్లా ఎన్నికల అధికారి సాయికాంత్‌వర్మకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన వెంట మైనార్టీ వర్గానికి చెందిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, బీసీ వర్గానికి చెందిన మేయర్ సురేష్ బాబు, ఎస్సీ వర్గానికి చెందిన డాక్టర్ దాసరి సుధ ఉన్నారు. నామినేషన్ అనంతరం రామసుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఎమ్మెల్సీగా నామినేషన్ వేశానన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని గౌరవించి, తనను వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యునిగా భావించి సహకరించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో టీడీపీ, బీజేపీ ప్రజాప్రతినిధుల సంఖ్యాబలం నామమాత్రంగా ఉన్నందున ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల ప్రజల చేయిపట్టుకొని రాజ్యాధికారం దిశగా ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు.



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి పి. రామసుబ్బారెడ్డి

### సమన్వయంతో పనిచేస్తాం: ఎమ్మెల్సీ అభ్యర్థి రామసుబ్బారెడ్డి

**జమ్మలమడుగు :** వైఎస్సార్‌సీపీ కోసం గత పదేళ్లుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఎలాంటి నష్టం కలగకుండా సమన్వయంతో ఎమ్మెల్యే సు.దీర్‌రెడ్డితో కలిసి పనిచేస్తామని వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలను కలిసి చర్చించారు. అనంతరం రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో తాను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి , ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల గెలుపుకోసం శక్తి వంచనలేకుండా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో మరింత మెజార్టీ కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పి.రామసుబ్బారెడ్డిలు కలిసి పనిచేస్తారని పేర్కొన్నారు.

### ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు..





ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి (పట్టభద్రుల స్థానం), ఎంవీ రామచంద్రారెడ్డి (ఉపాధ్యాయ), చిత్రంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ఇతర ప్రజాప్రతినిధులు

**అనంతపురం అర్బన్/సప్తగిరి సర్కిల్:** చట్టసభలు, రాజకీయాల్లో సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు బుధవారం ఆయన బీ ఫారం అందజేశారు. అనంతరం మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలతో కలిసి అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వద్ద నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆ తర్వాత మీడియా పాయింట్ వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా అనంతపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కాగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. పీడీఎఫ్ తరపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజు నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా..ఐదో రోజు బుధవారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు 41 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 32 సెట్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 9 సెట్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన ఈ నెల 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలకు 76 సెట్లు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 24వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహిస్తారు. ఈనెల 27 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు.

## న్యూస్‌రీల్

### 28న 'జగనన్న విద్యా దీవెన' నిధులు మంజూరు

**కడప రూరల్:** ఈనెల 28వ తేదీన 'జగనన్న విద్యాదీవెన' పథకం కింద ప్రభుత్వం నిధులను మంజూరు చేయనుంది. ఆయా కళాశాలల్లో అర్హులైన విద్యార్థులెవరైనా ఉంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్ తెలిపారు. రెన్యూవల్ విద్యార్థులు, ఫ్రెష్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు కాలేజీ లాగిన్‌లో తక్షణమే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని కళాశాలల యాజమాన్యాలు తగు చర్యలు చేపట్టాలన్నారు.

### గంగమ్మ జాతరతో ఆర్టీసీకి రూ.13 లక్షల ఆదాయం

**కడప కోటిరెడ్డిసర్కిల్:** లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గంగమ్మజాతరకు కడప రీజియన్ నుంచి ఆర్టీసీ 45 ప్రత్యేక బస్సులను నడపగా రూ.13,11,932 ఆదాయం వచ్చిందని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజరు గోపాల్‌రెడ్డి తెలిపారు.

### టీడీపీ ప్రాంతీయ సదస్సు వాయిదా

**కడప రూరల్:** ఈ నెల 25వ తేదీన కడపలో నిర్వహించనున్న టీడీపీ ప్రాంతీయ సదస్సు వాయిదా పడిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి బుధవారం తెలిపారు. త్వరలో సదస్సు జరుగుతుందని, ఈ కార్యక్రమానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు హాజరవుతారన్నారు.

### 'లా నేస్తం'తో 132 మందికి లబ్ధి

**కడప సిటీ:** 'లా నేస్తం' పథకం ద్వారా జిల్లాలో అర్హులైన 132 మంది జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో ఒక్కొక్కరి రూ. 5 వేలు చొప్పున రూ. 6.60 లక్షలు జమ చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం లా నేస్తం నాలుగో విడత పథకం నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీసీ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ లా డిగ్రీ తీసుకున్న తర్వాత తొలి మూడేళ్లు న్యాయవాదిగా స్థిరపడేందుకు వైఎస్సార్ లా నేస్తం కింద ఇచ్చే స్టయిఫండ్ న్యాయవాదులకు ఎంతో ఆర్థిక భరోసా ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి లబ్ధిదారులైన న్యాయవాదులు పాల్గొన్నారు.

## మాతా శిశు మరణాలను నివారించాలి



**కలెక్టర్ విజయరామరాజు**

**కడప సిటీ :** జిల్లాలో మాతా శిశు మరణాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో స్త్రీ శిశు సంక్షేమశాఖ సీడీపీఓలు, సఖి, వన్‌స్టాప్ సెంటర్, చిల్డ్రన్స్ హోం తదితర అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణి, బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని కచ్చితంగా వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఇందువల్ల రక్తహీనత, మాతా శిశు మరణాలను నివారించవచ్చన్నారు. అంగన్వాడీ కేంద్ర పరిధిలోని 3–6 సంవత్సరాల పిల్లల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల పోషకాహారం, వయస్సుకు తగ్గ పెరుగుదల ఉంటుందన్నారు. బాల్య వివాహాల నివారణ కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ ఎంఎస్ రాణి, ఓఎస్‌డీ రఘునాథ్, సీడీపీఓలు, సఖి వన్‌స్టాప్ సెంటర్ అధికారులు పాల్గొన్నారు.

## 28 లోపు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

**కడప అగ్రికల్చర్:** జిల్లాలో 36 మండలాల పరిధిలో పంటలను సాగు చేసిన రైతులందరూ తప్పకుండా ఈ నెల 28వ తేదీలోపు ఈ క్రాప్‌తో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో రబీ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాధారణ విస్తీర్ణం 3,99,968 ఎకరాలకు ఇప్పటి వరకు 2,96,895 ఎకరాల్లో పంట నమోదు చేయబడిందన్నారు. ప్రతి రైతు ఈ నెల 28వ తేదీ లోపు ఈ-క్రాప్ మరియు ఈ- కేవైసీని చేయించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియచేశారన్నారు.

## ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి: ఆర్‌జేడీ

**కడప ఎడ్యుకేషన్:** 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియేట్ ఆర్‌జేడీ రవి సూచించారు. బుధవారం కడప సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విధులలో అలసత్వం లేకుండా సిబ్బంది పనిచేయాలన్నారు. జిల్లా వృత్తి విద్యాధికారి శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐవో రమణరాజులు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో సమష్టిగా పనిచేసి జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలన్నారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ప్రకాష్, బీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి

### 24న ఆర్చరీ ఎంపికలు

**కడప స్పోర్ట్స్:** కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ఈనెల 24వ తేదీ ఉదయం జిల్లాస్థాయి ఆర్చరీ సీనియర్ విభాగం క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.వి.జనార్దన్‌రెడ్డి, రాచవీటి తేజేంద్రు తెలిపారు. ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో ఎంపికలుంటాయని, హాజరయ్యే క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు తీసుకు రావాలని సూచించారు.

### ఫొటోగ్రఫీ, సెల్‌ఫోన్ మరమ్మతులో ఉచిత శిక్షణ

**కడప కార్పొరేషన్:** కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్, సర్వీసింగ్, టూ వీలర్ మెకానిక్(30 రోజులు), సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్(13 రోజులు) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర ఎస్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల లోపు ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. మార్చి 13వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం కానుందని, ఆసక్తిగల వారు తిరుపతి రోడ్డులో గర్ల్స్ ఐటీఐ పక్కనున్న తమ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చువారికి ఉచిత భోజన, వసతి సౌకర్యం కలదన్నారు. వివరాలకు 9440905478, 6302833546 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

## కల్యాణం.. కమనీయం

మండలంలోని కొత్తపేట-బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ జాతరలో భాగంగా బుధవారం అమ్మవారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మెన్ బుసిరెడ్డి పార్వతమ్మ గారి విశ్వనాథరెడ్డి ఇంటి నుంచి సాంగ్యాన్ని మేళాతాళాలతో, బాణసంచా మధ్య ఆలయానికి తీసుకువచ్చి ఘనంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం కల్యాణంలో ఏర్పాటు చేసిన లడ్డూను వేలం వేశారు. భక్తులకు ఆలయ అధికారులు ముత్యాల తలంబ్రాలను పంచిపెట్టారు. జాతర రెండవ రోజు మైల తిరునాల కావడంతో జిల్లా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ కుమార్‌రెడ్డి, ఎస్ఐ బి. అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టారు. -చింతకొమ్మదిన్నె



అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తజనం

## అపూర్వం.. మహానైవేద్య ఘట్టం



మహానైవేద్యాన్ని కొల్లగొడుతున్న వడియ రాజులు



త్రినేత్రుడుగా ( ఉగ్రరూపంలో) భక్తులకు దర్శనమిస్తున్న వీరభద్రస్వామి

హర హర మహాదేవ.. అంటూ భక్తుల శివ నామ స్మరణల మధ్య రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయంలో వేలాది భక్తుల సమక్షంలో మహానైవేద్య ఘట్టం కనుల పండువగా జరిగింది. వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన ఘట్టం మహానైవేద్యం. ఈ దృశ్యాన్ని కళ్లారా చూడాలని తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది భక్తులు రాయచోటికి తరలి వచ్చారు. సుండుపల్లె మండలం బింగివాండ్లపల్లె గ్రామానికి చెందిన వడియరాజులు తడి దుస్తులతో మడికట్టి అన్నం వండి సిద్ధం చేశారు. వేదపండితుడు నందుల మఠం శశిభూషణ్ సిద్ధాంతి ఆధ్వర్యంలో వీరభద్రస్వామికి (మూడవ కన్ను) త్రినేత్రం ధరింపచేశారు. ఆ సమయంలో కన్నడ భక్తుల విన్యాసాలు.. లింగాయత్తులు చేసిన హరహర మహాదేవ స్మరణల మధ్య ఈ అపూర్వ ఘట్టాన్ని భక్తులు వీక్షించారు.
-రాయచోటిటౌన్

## క్లుప్తంగా

### కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మోడంపల్లెలో కడుపు నొప్పి తాళలేక మనీషా (28) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మోడంపల్లెకు చెందిన రామ్మోహన్‌రెడ్డికి నాలుగేళ్ల క్రితం మనీషాతో వివాహమైంది. వారికి రెండేళ్ల కుమార్తె ఉంది. అతను ఎలక్ట్రీషియన్ పని చేస్తుంటాడు. కొన్ని రోజుల నుంచి మనీషాకు కడుపు నొప్పి ఉండేది. ఆస్పత్రిలో చూపించినా నయం కాలేదు. దీంతో ఆమె బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీర చుట్టి ఉరేసుకుంది. ఆమె తండ్రి తిమ్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు.

### మెకానిక్ షాపు దగ్ధం

పులివెందుల రూరల్ : పట్టణంలోని సప్తగిరి లాడ్జి సమీపంలో ఉన్న దౌలత్ ఖాన్‌కు చెందిన మెకానిక్ షాపు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే షాపు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

### మానవత్వం చాటుకున్న సీఐ



పాడె మోస్తున్న పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలో ఉన్న ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో ఉన్న అనాథ వృద్ధుడు బేతంచెర్ల సత్యరాజు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎర్రగుంట్ల పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం,దానగుణం, మానవత్వం కలిగి ఉండాలన్నారు.అంత్యక్రియలలో వృద్ధాశ్రమ చైర్మన్ ఎద్దుల నాగేంద్ర, మైదుకూరు జనసేన ఇన్‌చార్జి శ్రీరాం వంశీ, అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయబాబు, మురిరాజ్ యువజన అధ్యక్షుడు రాము, కానిస్టేబుల్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

# పెయ్యదూడల ఉత్పత్తి.. పాడిరైతుకు సంపత్తి




- లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్యదూడల ఉత్పత్తి
- పాల దిగుబడుల పెంపే ధ్యేయం
- గత ఏడాది నవంబర్‌లో ప్రారంభమైన పథకం



పెయ్య దూడల ఉత్పత్తి పథకం కింద పశువులకు లింగ నిర్ధారిత వీర్యంతో కూడిన ఎద సూదులను వేస్తున్న పశు వైద్యాధికారి

వల్లూరు : లింగ వివక్షతను వీడండి..మహిళైనా, పురుషుడైనా ఒకటే అనే నినాదం మనుషుల వరకు పరవాలేదు.. కానీ పశువుల్లో ఆడ అయితేనే మేలు అనాల్సి వస్తోంది. ఎందుకంటే మనుషులు జీవనం సాగించడంలో భాగంగా ఆదాయార్జనే ధ్యేయంగా పశువులను పెంచుతున్నారు. ఒకప్పుడు పశువుల్లో దున్న, ఎద్దులను సేద్యాలకు ఉపయోగించే వారు. అందువల్ల పశువుల్లో మగ దూడల ఉత్పత్తి లాభసాటిగా ఉండేది.మారిన పరిస్థితుల్లో వాటితో సేద్యాలు చేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ క్రమంలో పశువుల్లో మగ దూడల ఉత్పత్తి లాభసాటిగా ఉండకపోవడంతో పశు పోషకులకు నిర్వహణ భారంగా మారుతోంది.దీంతో పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పశువుల్లో పెయ్య (ఆడ) దూడల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి పాల దిగుబడులను గణనీయంగా పెంచాలని, తద్వారా రైతులకు అదనపు ఆదాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులు అనే నినాదంతో పెయ్య దూడల ఉత్పత్తి పథకానికి శ్రీకారం చుట్టింది.లింగ నిర్ధారిత వీర్యాన్ని ఉపయోగించడం ద్వారా రైతులకు కావాల్సిన పెయ్య దూడలను 90 శాతం ఖచ్చితత్వంతో పుట్టించడానికి చర్యలు చేపట్టింది. ఇందుకుగాను లింగ నిర్ధారిత వీర్యంతో కూడిన ఎద సూదులను సబ్సిడీపై అందుబాటులో ఉంచింది.

**పైలెట్ ప్రాజెక్ట్ కింద 5 మండలాల్లో అమలు**

పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని 2017–18లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 5 మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు చేశారు. సంబేపల్లె, చిన్నమండెం, సుండుపల్లె, వీరబల్లి, రాయచోటి మండలాల్లో అమలు చేసి పరిశీలించారు. గత ఏడాది నవంబర్ మాసం నుంచి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 31 మండలాల్లో ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో ప్రారంభించారు. చింతకొమ్మదిన్నె, కమలాపురం, వల్లూరు, చక్రాయపేట, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బీ కోడూరు, బీ మఠం, అట్లూరు, చాపాడు, మైదుకూరు, దువ్వూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, యర్రగుంట్ల, వీరపునాయునిపల్లె, కొండాపురం, సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం, వీరబల్లి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు, కోడూరు, రాయచోటి, చిట్వేలి, పెనగలూరు, రాజంపేట, నందలూరు మండలాల్లో పథకాన్ని ప్రారంభించారు.

**అమలు ఇలా..**

మేలైన పశు సంపద కలిగిన లింగ నిర్ధారిత వీర్యంపై ఆసక్తి ఉన్న పశు పోషకులను ఎంపిక చేస్తారు. వారి వద్ద ఉన్న పశువుల్లో ఇటీవల 60 నుంచి 90 రోజుల లోపు ఈనిన, 1 నుంచి 3 ఈతల మధ్య క్రమం తప్పకుండా ఎదకు వచ్చే గర్భకోశ వ్యాధులు లేని కట్టు శాతం ఎక్కువగా ఉండే పశువులను ఎంపిక చేస్తారు. సంబంధిత పశు పోషకులు, పశు వైద్యాధికారుల మధ్య ఒప్పందం జరుగుతుంది.తర్వాత సదరు పశువుకు లింగ నిర్ధారిత వీర్యంతో కూడిన ఎద సూదులను వేస్తారు.

**ఖర్చు, రాయతీ**

ఈ పథకం కింద ఒక్కో కృత్రిమ గర్భధారణకు ఒక్కొక్కటి రూ. 675 చొప్పున రెండు లింగ నిర్ధారిత వీర్య నాళికలను రూ 1350 లకు అందిస్తారు. ఇందులో ప్రభుత్వం రూ 850 రాయితీ పోను రైతు వాటా రూ. 500 చెల్లించాల్సి ఉంటుంది. ఒక వేళ రెండు పర్యాయాలు కృత్రిమ గర్భధారణ సూదులను వేసిన తర్వాత కూడా పశువు గర్భం దాల్చక పోతే రైతు చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇస్తారు. ఒక్కసారి మాత్రమే గర్భధారణ చేయించి రెండో సారి చేయించని వారికి డబ్బు చెల్లించరు. మొదటి సారి కృత్రిమ గర్భధారణ ద్వారా గర్భం దాల్చిన పశువు మగ దూడకు జన్మనిస్తే డబ్బు తిరిగి ఇవ్వరు. ఒక వేళ రెండో సారి గర్భ ధారణ తరువాత మగ దూడ పుట్టినట్లయితే రూ. 250 రైతుకు చెల్లిస్తారు.

**అందుబాటులోని రకాలు**

పశువుల్లో ముర్రా, జెర్సీ, హెచ్ఎఫ్ జెర్సీ, గిర్, సాహివాల్ మొదలైన జాతుల లింగ నిర్ధారిత వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయి. ఈ మేరకు పశువుల్లో ఎద లక్షణాలు గుర్తించడం, కృత్రిమ గర్భధారణ చేయించే సమయం మొదలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ పొందిన పశు వైద్య సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తారు.

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులు పెరగాల్సిన అవసరం ఉంది. ఇందులో మంచి ఆహారంగా పేరు పొందిన పాల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో లింగ నిర్ధారిత వీర్యంతో పశువుల్లో కృత్రిమ గర్భధారణ ప్రయోజనకరం. దీనివల్ల పెయ్య దూడల ఉత్పత్తి పెరిగి రెండు మూడేళ్లలో పాల దిగుబడులు గణనీయంగా పెరగడానికి దోహదపడుతుంది. దీనివల్ల దేశంలోఆహార అవసరాలను తీర్చడంతో పాటు రైతుల ఆదాయాన్ని మరింత పెంచడానికి ఉపయోగ పడుతుంది. పాడి రైతులు పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ జీ రమేష్, డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, కడప

### విధులకు ఆటంకం కల్పించారని కేసు

కొండాపురం : మండల పరిధిలోని లావనూరు గ్రామంలో ప్రభుత్వం భూమి అక్రమించారని ఆరోపణలు రావడంతో ఇన్‌చార్జి ఆర్ఐ ఆనంద్ పరిశీలించడానికి బుధవారం వచ్చారు. ఇతను విధులు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన వెన్నపూస ఈశ్వర్‌రెడ్డి, ఆతని భార్య ఆటంకం కలిగించారు. ఇన్‌చార్జి ఆర్ఐ ఫోన్ లాక్కొని పగులకొట్టారు.దీంతో ఆర్ఐ ఆనంద్ కొండాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు వెన్నపూస ఈశ్వర్‌రెడ్డి అతని భార్యపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని కొండాపురం ఎస్ఐ సత్యనారాయణ తలిపారు.

### నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

రాజుపాళెం : అభం, శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై ఓకామాంధుడు అత్యాచారం చేసిన సంఘటన రాజుపాళెం మండలంలోని పగిడాల గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన ఓవ్యక్తి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు, చిన్నారికి రక్త గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిసింది. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు.

### అగ్నిపమాదం : రూ.5లక్షలు నష్టం

లింగాల : లింగాల మండలం కర్ణపాపాయపల్లె గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన పుట్లూరు రామాంజనేయరెడ్డి అనే రైతుకు చెందిన 4ఎకరాల అరటి పంట కాలిపోయింది. గ్రామ సమీపంలోని కొండకు నిప్పు పెట్టడంతో మంటలు అరటి తోటలోకి వ్యాపించాయి. గెలలతో ఉన్న అరటి చెట్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు కాలి బూడిదయ్యాయని బాధిత రైతు వాపోయాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5లక్షల దాకా పంట నష్టం జరిగిందని ఆయన తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

### లారీల ఢీ - డ్రైవర్ మృతి

గుంతకల్లు రూరల్ : రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం మోతుకూరు గ్రామానికి చెందిన హరిజన నాగరాజు (40), తొండూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన రత్నరాజు బుధవారం ఉదయం గుంతకల్లు నుంచి గుత్తికి లారీ తీసుకుని బయలుదేరారు. పట్టణ శివారులోని పారిశ్రామిక వాడ వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక ఎదురుగా వస్తున్న మరో లారీపైకి దూసుకెళ్లారు. ప్రమాదాన్ని పసిగట్టిన మరో లారీ డ్రైవర్ వెంటనే తన వాహనాన్ని పక్కకు తిప్పాడు. అదే సమయంలో నాగరాజు నడుపుతున్న లారీ ఎదురుగా ఉన్న లారీ వెనుకభాగాన్ని బలంగా ఢీకొంది. ఘటనలో డ్రైవర్ నాగరాజుతో పాటు క్లీనర్ రత్నరాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### విద్యుదాఘాతంతో వృద్ధురాలు..

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : విద్యుదాఘాతంతో బుధవారం మంచాల రమణమ్మ (66) అనే వృద్ధురాలు మృతి చెందింది. ఏఎస్ఐ ఆంజనేయులు కథనం మేరకు మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన మంచాల రమణమ్మ మధ్యాహ్నం సమయంలో వంట చేసేందుకు రైస్ కుక్కర్ ఆన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు భర్త ఆంద్రూ మైలవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

### ముఖ్యమంత్రిని కలిసిన ఏఎఫ్‌యూ వీసీ



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ ఏఎఫ్‌యూ వీసీ బానోతు ఆంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలసి వైస్ చాన్సలర్‌గా అవకాశం కల్పించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్ట్

- రూ. 4లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.20 వేలు నగదు స్వాధీనం
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని బి..మఠం మండలం నందిపల్లి క్రాస్ వద్ద ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను ఈనెల 21వ తేదీన పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గతంలో దొంగతనాలకు పాల్పడిన వివిధ కేసుల్లో రూ. 4లక్షల విలువైన బంగారు ఆభరణాలను, రూ. 20 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ×పెన్నార్₹ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. అరెస్టయిన దొంగలలో గుంటూరు జిల్లా గోరంట్ల, అమరావతి రోడ్డులో నివాసం ఉంటున్న చిల్లర సురేష్, ఈతి అగ్రహారానికి చెందిన పైర్డా కిరణ్‌బాబు ఉన్నారు. వీరు 2019, 2020, 2023 సంవత్సరాలలో బి, మఠం మండలంలోని గంగిరెడ్డి పల్లె, నరసన్నపల్లె, లింగాలదిన్నె పల్లె గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు.నిందితుల నుంచి సుమారు రూ. 4లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 20 వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా వీరు గుంటూరులోని అట్టికా గోల్డ్ సంస్థలో 125 గ్రాముల బంగారు ఆభరణాలను విక్రయించారు. పెదనందిపాడులోని ముత్తూట్ ఫైనాన్స్‌లో 30 గ్రాముల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టారు. ఆయా సంస్థల వారికి నోటీసులు పంపించామని ఎస్పీ తెలిపారు. అరెస్టయిన ఇద్దరు ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలలో సుమారు 73 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. 16 కేసుల్లో శిక్ష అనుభవించారు. ఇంకా 9 కేసుల్లో వీరిపై వివిధ కోర్టులలో విచారణ ఎదుర్కొంటున్నారు. మిగిలిన కేసులు కొట్టివేశారు.దొంగతనాల కేసులో వీరితో పాటు మరో ఇద్దరు కూడా ఉన్నారు.వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రారెడ్డి, బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వీరిలో కొందరికి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.





### ఏకసభ్య కమిషన్‌తో బోయలకు సమంజస న్యాయం

– రాష్ట్ర ఏకసభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్ కుమార్



మాట్లాడుతున్న శామ్యూల్ ఆనంద్‌కుమార్

కడప సిటీ: ఏకసభ్య కమిషన్ ద్వారా బోయలు, వాల్మీకి సామాజిక వర్గ ప్రజలకు ఆమోదయోగ్యమైన, న్యాయబద్ధమైన రిజర్వేషన్ సదుపాయం లభిస్తుందన్న ఆశాభావాన్ని రాష్ట్ర ఏకసభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో బోయ, వాల్మీకి సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చాలన్న అంశంపై అధ్యయనం చేసేందుకు ఆయన జిల్లా ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల ఈడీ వెంకట సుబ్బయ్య, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి బ్రహ్మయ్యలతో కలిసి సంబంధిత వర్గాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్నేళ్లుగా బోయలను ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండును త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేసేందుకు ముందడుగు వేసిందన్నారు. అనంతరం ఈ సమావేశానికి హాజరైన పలువురు బోయలు తమను ఎస్టీల్లో చేర్చాలన్న వారి వారి అభిప్రాయాలను వెల్లడించారు. పలువురు ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయ, వాల్మీకి కమిషన్ డైరెక్టర్ లోమడ నారాయణస్వామి, కడప నగరానికి చెందిన విశ్రాంత ఎస్టీఓ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు వీరే !

సాక్షి ప్రతినిధి, కడప : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకాలు బుధవారం జరిగాయి. వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. కాగా, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

| విభాగం | జిల్లా అధ్యక్షుడి పేరు | ప్రాంతం |
|---|---|---|
| యూత్ | శ్రీకాంత్‌రెడ్డి | కడప |
| మహిళా | లింగాల ఉషారాణి | పులివెందుల |
| రైతు | పి.ప్రసాద్‌రెడ్డి | కమలాపురం |
| బీసీ | బంగారు నాగయ్య | కడప |
| ఎస్సీ | సి.వినోద్‌కుమార్ | కడప |
| ఎస్టీ | వేణుగోపాల్‌నాయక్ | కడప |
| విద్యార్థి | సాయిదత్త | కడప |
| సేవాదళ్ | సమరనాథరెడ్డి | జమ్మలమడుగు |
| పబ్లిసిటీ | నాగేంద్రరెడ్డి | కడప |
| పంచాయితీరాజ్ | కల్లూరు నాగేంద్ర | ప్రొద్దుటూరు |
| క్రిస్టియన్, మైనార్టీ | సంపత్ | కడప |
| గ్రీవెన్స్‌సెల్ | యం.మల్లికార్జున | కడప |
| ఐటీ వింగ్ | కల్లా నిత్య ఈశ్వర్ | కమలాపురం |
| వాణిజ్య | కరుణాకర్ | పులివెందుల |
| కల్చరల్ వింగ్ | పుల్లారెడ్డి | జమ్మలమడుగు |
| చేనేత | యం.వెంకటలక్ష్మీదేవి | ప్రొద్దుటూరు |
| వైఎస్ఆర్ టీయూసీ | మల్లూరి జాషువ | కడప |
| వికలాంగుల విభాగం | షేక్ అహ్మద్‌బాషా | కడప |
| డాక్టర్స్ | ఐ.శివనాయక్ | కడప |

### ‘సీమ’ పోరాట పటిమకు నిదర్శనం ఉయ్యాలవాడ



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి

కడప కల్చరల్ : రాయలసీమ తొలి స్వాతంత్ర్య పోరాట యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఈ ప్రాంత పోరాట పటిమకు నిదర్శనమని కడప నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి పేర్కొన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక రాజీవ్‌మార్గ్‌లోని రెడ్డి సేవా సమితి హాస్టల్ ఆవరణలో సభ నిర్వహించారు. తొలుత నరసింహారెడ్డి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించారు. పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన నిత్యానందరెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయులపై తొలి తిరుగుబాటు చేసి స్వాతంత్ర్య సమరానికి తొలి బీజం వేసిన వ్యక్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కావడం మనందరికీ గర్వకారణమన్నారు. కడపలో ఆయన విగ్రహం ఏర్పాటుకు తమవంతుగా తప్పక కలిసి వస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య గౌరవ అతిథిగా మాట్లాడుతూ 30 సంవత్సరాలపాటు కోట గుమ్మానికి వేలాడిన నరసింహారెడ్డి తల కూడా మరణమైనా చరిత్ర సృష్టిస్తుందని తెలిపారు.మహావధాని డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ నరసింహారెడ్డి తెల్లవారిపై తొలి తిరుగుబాటు చేసితన ప్రాణాన్ని హారతి ఇచ్చాడన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ కె.నాగిరెడ్డి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రను పాఠంగా పెట్టాలన్నారు. లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ 175 సంవత్సరాల తర్వాత కూడా నరసింహారెడ్డి శౌర్యం, జానపదుల గళాల్లో పాటగా నిలువడం విశేషమన్నారు. రెడ్డి సేవా సమితి కార్యదర్శి లెక్కల కొండారెడ్డి కార్యక్రమం గురించి వివరించారు. స్థానిక ప్రముఖులు మానవత సుబ్బారెడ్డి, దేసు వెంకటరెడ్డి, లయన్స్ అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, డాక్టర్ మూలె రామమునిరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నరసింహారెడ్డిపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గాయని సరళ నరసింహారెడ్డిపై జానపద గేయం ఆలపించారు. లయన్ గౌరీశంకర్, కొండారెడ్డి, కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, షఫీ, వైఎస్సార్ సీపీ నాయకులు రవి, శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

### జిల్లా హ్యాండ్‌బాల్ సంఘానికి ఫెడరేషన్ గుర్తింపు

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా చిన్నపరెడ్డి, సింధూరి



కె.చిన్నపరెడ్డి



ఎ.సింధూరి

కడప స్పోర్ట్స్: వైఎస్ఆర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ (రిజిష్టర్ నెం : 30/2023)కు ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ గుర్తింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియాకు అనుబంధంగా ఉన్న ఏపీ హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘానికి గుర్తింపు ఇచ్చినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఎన్. రాజు తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కంభం చిన్నపరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అరిగెల సింధూరి, కోశాధికారిగా సయ్యద్ బాబర్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ బృందం జిల్లాలో హ్యాండ్‌బాల్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

**24న జిల్లాస్థాయి ఎంపికలు :** కడపలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఈనెల 24వతేదీ ఉదయం 8 గంటలకు ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ బాలుర జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. పూర్తి వివరాలకు 7780608954, 9502217522 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### స్పెషల్ డ్రైవ్‌లో 298 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో వాహనదారులు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించని వారిపై ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు బుధవారం పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. వీరిలో హెల్మెట్ ధరించని వారిపై 249 కేసులు, సీటు బెల్ట్ ధరించని వారిపై 49 కేసులు మొత్తం 298 కేసులను పెట్టారు.

**యువకుడిపై దాడి: 8 మందిపై కేసు నమోదు**

కడప అర్బన్ : కడప ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని నాయబ్‌సాబ్‌వీధిలో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్ అబ్దుల్ రహీం (23) అనే యువకుడిపై ఈనెల 21వ తేదీ రాత్రి జువైనల్‌తో పాటు మరో ఏడుగురు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఎంబీఏ చదువుతున్నాడు. బయట నుంచి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యలో యువకులు మోటార్‌సైకిళ్లను దారికి అడ్డంగా పెట్టుకుని ఉండగా, వచ్చే,పోయే వారికి ఇబ్బంది ఉంటుంది. పక్కకు వెళ్లాలని రహీం వారితో అన్నాడు. వారు యువకుడిపై దాడి చేసి గాయపరిచారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కడప వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.